సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



గెలుపే లక్ష్యం

ఎస్సై పోస్టుల భర్తీలో భాగంగా నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు ఉత్సాహంగా సాగుతున్నాయి. యువకులు గెలుపే లక్ష్యంగా పోటీపడుతున్నారు. 8లో



శ్రీవారి క్షేత్రంపై డాక్యుమెంటరీ

చినవెంకన్న క్షేత్ర చరిత్ర, స్థల పురాణంపై డాక్యుమెంటరీ ఫిలిం నిర్మించి, డిజిటల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని ధర్మకర్తల మండలి తీర్మానించింది. 8లో



మహిళ హత్య

ఏలూరు వన్‌టౌన్‌లోని దక్షిణపు వీధిలో వివాహితను ఆమె ప్రియుడు దారుణంగా హత్యచేశాడు. అనంతరం అతడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. 8లో

న్యూస్‌రీల్

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం



రిబ్బన్ కట్ చేస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: గోటేరు గ్రామ పంచాయతీ బోర్డు సభ్యుడు మెంటే రాధా రామకృష్ణ జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇంటిని సోమవారం పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ బోర్డు ఎన్నికల్లో రాధా రామకృష్ణ ఘన విజయం సాధించారని, ఇందుకు కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమైక్యంగా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు కిషోర్, బాబ్జీ, సుబ్రమణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు స్పందన



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీసు స్పందన కార్యక్రమంలో 23 మంది నుంచి ఎస్పీ యు.రవిప్రకాష్ ఫిర్యాదులు తీసుకున్నారు. వాటిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. వరకట్నం వేధింపులు, సరిహద్దు గొడవులు, సివిల్ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై సత్వరమే చట్టప్రకారం విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ రవిప్రకాష్ ఫోన్‌లో ఆదేశించారు. అడిషినల్ ఎస్పీ(అడ్మిన్) ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సంఘ కార్యవర్గం ఎన్నిక

తణుకు: రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లాశాఖ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేలపాటి వెంకటరమణ, నల్లజర్ల వెంకటరాంప్రసాద్ తెలిపారు. సోమవారం కార్యవర్గ వివరాలను వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎంఎస్ శ్రీమన్నారాయణ (వీరవాసరం), అధ్యక్షుడిగా నేలపాటి వెంకటరమణ (మంచిలి), ప్రధాన కార్యదర్శిగా నల్లజర్ల వెంకటరాంప్రసాద్ (కొప్పర్రు), కోశాధికారిగా బండి ఆంజనేయులు (దువ్వ) ఎన్నుకున్నామన్నారు. మహిళా ప్రతినిధులుగా పి.రంగవల్లి (కొవ్వాడ అన్నవరం), జి.కనకదుర్గ (కృష్ణాయపాలెం), కార్యాలయ కార్యదర్శిగా పొట్ల రాము (శివదేవుని చిక్కాల), నిర్వాహక కార్యదర్శిగా చెన్న కేశవుల సత్యనారాయణ (మండపాక), కేంద్ర కార్యదర్శిగా వి.ప్రియారామ్ (పండితవిల్లూరు), మున్సిపల్ ప్రతినిధిగా కోడే వెంకట్రావు (చినరంగనిపాలెం), ఎయిడెడ్ ప్రతినిధిగా ఎస్‌కేఎస్ రాఘవాచార్యులు (పెంటపాడు), సాంకేతిక ప్రతినిధిగా బి.రాజారావు (తాడేపల్లిగూడెం)తోపాటు రాష్ట్ర కౌన్సిలర్లుగా దాసరి రామ వెంకట సత్యనారాయణ (ఏలేటిపాడు), పి.బ్రహ్మం (తాడేపల్లిగూడెం), ఎం.బాలనాగమణి (సావర)ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

30న క్రీడా పోటీలు

సాక్షి, భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈనెల 30న భీమవరం డీఎన్నార్ కళాశాల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు చీఫ్ కోచ్ ఎం.సురేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగా, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో పోటీలు ఉంటాయని, ప్రతిభ కనబర్చిన వారు వచ్చేనెల 4 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల ఉద్యోగులు డీఎన్నార్ కళాశాల కార్యాలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

సత్రంపాడు హెచ్‌ఎం సస్పెన్షన్

ఏలూరు (టూటౌన్): ఏలూరు సత్రంపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.శైలజను సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ (కాకినాడ) జి.నాగమణి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినులతో అసభ్యకర పదజాలం ఉపయోగించడంతో పాటు నిర్లక్ష్యం, అవిధేయత, అడ్మినిస్ట్రేషన్‌లో విఫలం వంటి కారణాలతో ఆమెను సస్పెండ్ చేస్తూ, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఏలూరు వదిలి వెళ్లరాదని ఆదేశించారు. ఆమెపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లీబిడ్డా చల్లగా.. ఆరోగ్యం మెండుగా..

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు
- మాతాశిశు సేవలో 102 సిబ్బంది
- 15 నెలల్లో 10,976 మందికి సేవలు
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 33 తల్లీబిడ్డ వాహనాలు
- ఆడబిడ్డలకు అండగా సీఎం జగన్

ఏలూరు టౌన్: ఇంటికి పెద్దన్నలా ప్రతి ఆడబిడ్డకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. అక్కచెల్లెమ్మలకు నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారు. గర్భిణిగా ఉన్నప్పటి నుంచి ప్రభుత్వాస్పత్రిలో ప్రసూతి, ప్రసవం అనంతరం తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చే వరకూ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. దీనిలో భాగంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రవేశపెట్టింది. గర్భిణిగా ఉన్నప్పుడు ఫ్యామిలీ డాక్టర్ ఇంటికే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. ఏలూరులోని జీజీహెచ్‌లో మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ఆధునిక వైద్య చికిత్సను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక్కడ రూపాయి ఖర్చు లేకుండా ప్రసూతి సేవలు అందించడంతో పాటు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా ప్రసవనాంతరం ఇంటికి చేరుస్తున్నారు.

15 నెలలుగా..

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డను సురక్షితంగా, సౌకర్యవంతంగా ఇంటికి చేర్చే బృహత్తర కార్యక్రమం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 నెలలుగా దిగ్విజయంగా సాగుతోంది. దీనిపై అంతటా హర్షం వ్యక్తమవుతోంది. గత నెల వరకూ 33 వాహనాల ద్వారా 10,976 మంది బాలింతలను చంటి బిడ్డలతో సురక్షితంగా ఇంటికి చేర్చారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు

నెల	అందించిన సేవలు	నెల	అందించిన సేవలు	నెల	అందించిన సేవలు
2022 ఏప్రిల్	645	అగస్టు	834	ఫిబ్రవరి	441
మే	777	సెప్టెంబర్	764	మార్చి	611
జూన్	812	అక్టోబర్	814	ఏప్రిల్	712
జూలై	742	నవంబర్	757	మే	661
		డిసెంబర్	691	జూన్	602
		2023 జనవరి	499	జూలై	614



తన చిన్నారితో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు ఇంటి వద్దకు క్షేమంగా చేరిన ఓ మహిళ (ఫైల్)

బాలింతలకు మేలు



ఏలూరు జీజీహెచ్, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసూతి అనంతరం బాలింతల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. వీటి ఆధారంగా ఆయా ఆస్పత్రులకు వెళ్లి తల్లి, బిడ్డ, సహాయకులతో కలిపి సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నాం. సీఎం జగన్ ఆదేశాల మేరకు బాలింతలకు అసౌకర్యం లేకుండా సేవలందిస్తున్నాం. హాయిగా ఇంటికి చేర్చడం బాలింతలకు మేలు చేస్తోంది. 102 సిబ్బంది సేవలపై అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

–కార్తీక్, జిల్లా ఇన్‌చార్జి, 102 సేవలు

అత్యుత్తమ సేవలు



ఉమ్మడి జిల్లాలో 33 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నాం. ఏలూరు జీజీహెచ్‌తోపాటు ప్రసూతి సేవలు ఉన్న ప్రభుత్వాస్పత్రుల వద్ద వాహనాలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు ఇద్దరు, ముగ్గురికి సేవలందిస్తున్నాం. ప్రభుత్వం కొత్త వాహనాలు కొనుగోలు చేసి సమర్థవంతమైన సేవలు అందిస్తోంది.

–జి.గణేష్, జోనల్ మేనేజర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు

ప్రతి ఇంటికీ మేలు



జగనన్న ప్రతి ఇంటికి పెద్దలా మేలు చేస్తున్నారు. నేను ప్రసవానంతరం బిడ్డతో కలిసి సురక్షితంగా మా ఇంటికి వెళ్లే ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సేవలు అందించిన ప్రభుత్వాలు లేవు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఏర్పాటుచేసి మాలాంటి వారికి మేలు చేయడం సంతోషంగా ఉంది. ఉచితంగా ప్రసూతి వైద్యసేవలు అందించడంతో పేద కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు తప్పాయి.

–ఎ.కావేరి, భీమవరం

నా బిడ్డతో సురక్షితంగా..



ఈనెల 13న ఏలూరు జీజీహెచ్‌లో ప్రసూతి కోసం చేరాను. 108 అంబులెన్స్‌లో ఇక్కడకు తీసుకువచ్చారు. ప్రసవం అనంతరం ఈనెల 23న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఇంటికి సురక్షితంగా చేర్చారు. నాకు కవలలు పుట్టారు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఇలాంటి సేవలు చాలా ఉపయోగం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సేవలు, పథకాలు ఎంతో బాగున్నాయి.

–కె.శ్రావణి, వెల్లమిల్లి, తాడేపల్లిగూడెం

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందన అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందనలో 235 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు రీఓపెన్ కాకుండా కచ్చిత పరిష్కారం చూపాలన్నారు. ప్రజల నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని స్నేహపూరిత వాతావరణంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, హౌసింగ్ పీడీ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, డీఎస్పీ బి.శ్రీనాథ్, వయోవృద్ధులు ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పాలకోడేరు మండలం మోగల్లు గ్రామ కార్యదర్శి కనుమూరి వెంకటరాజు పంచాయతీ సొమ్ములు సొంత ఖాతాలో వేసుకోవడం, గ్రామస్తులకు సరిగా సేవలందించకపోవడం వంటివి అధికారుల విచారణలో తేలినా చర్యలు తీసుకోలేదని నేతల శ్యామ్‌కుమార్ గ్రామస్తుల సంతకాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.
- పాలకోడేరు మండలం విస్సాకోడేరువాసి దిగమర్తి సత్యనారాయణ తాను రెండు సెంట్లు భూమిలో కష్టపడి ఇల్లు కట్టుకున్నానని కొడుకు ఇంటి నుంచి గెంటివేశాడని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.
- పెనుగొండ మండలం వడలి నివాసి చిటికెన లక్ష్మి తన భర్త, అత్తమామలు, ఆడపడుచు ఇబ్బందులు పెడుతున్నారని, రక్షణ కల్పించాలని అర్జీ అందజేశారు.
- అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్ బీబీ, తులా గౌతమి, కొందరు గ్రామస్తులు పైప్‌లైన్ల సమస్యలు తీర్చి రక్షిత మంచినీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.
- ఆచంట మండలం కొడమంచిలి నివాసి చింతలపూడి సావిత్రి తన రెండెకరాలు భూమి దస్తావేజులు తన కొడుకు తీసుకుని ఇబ్బంది పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.
- భీమవరం మండలం ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన కొందరు ఆక్వా రైతులు తమకు విద్యుత్ రాయితీ అందడం లేదని విద్యుత్ రాయితీ కల్పించాలని అర్జీ పెట్టుకున్నారు.

ఏపీపీఎస్సీ ఫలితాలు విడుదల

ఏలూరు(మెట్రో): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి మెయిన్స్ రాసిన అభ్యర్థుల మెరిట్ జాబితా నుంచి 1:2 ప్రాతిపదికన కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ పరీక్ష నిర్వహించారన్నారు. ఈ పరీక్షా ఫలితాలను www.eluru.ap.gov.in, www.wertgodavari.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు.

పేదల చదువుకు జగనన్న దీవెనలు

31,188 మందికి రూ.25.53 కోట్ల జమ

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం సీఎం జగన్ విద్యా దీవెన నిధులు జమచేసిన కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 31,188 మంది విద్యార్థులకు రూ.25.53 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. వీరిలో బీసీలు 14,451 మందికి రూ.10.32 కోట్లు, ఎస్సీలు 5,434 మందికి రూ.4.32 కోట్లు, ఈబీసీలు 2,876 మందికి రూ.2.50 కోట్లు, కాపులు 7,238 మందికి రూ.5.50 కోట్లు, ఎస్టీలు 171 మందికి రూ.98 లక్షలు, ముస్లింలు 328 మందికి రూ.30 లక్షలు, క్రిస్టియన్లు 690 మందికి రూ.47 లక్షల లబ్ధి చేకూరుతుందన్నారు. నియోజకవర్గాల వారీగా ఆచంటలో 4,622 మందికి రూ.3.16 కోట్లు, భీమవరంలో 4,732 మందికి రూ.3.80 కోట్లు, నరసాపురంలో 3,765 మందికి రూ.2.69 కోట్లు, పాలకొల్లులో 3,784 మందికి రూ.2.77 కోట్లు, తాడేపల్లిగూడెంలో 4,666 మందికి రూ.3.77 కోట్లు, తణుకులో 5,254 మందికి రూ.4.01 కోట్లు, ఉండిలో 4,365 మందికి రూ.3.30 కోట్లు ఖాతాల్లో జమకానుందన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి శోభారాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, గిరిజన సంక్షేమాధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్ నుంచి సీఎం జగన్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ నుంచి గృహనిర్మాణం, ప్రభుత్వ భవనాలు, జాతీయ ఉపాధి హామీ పథకం, జీజీఎంపీ, చేయూత గ్రౌండింగ్, జగనన్న తోడు, నాడు–నేడు, జీఈఆర్, ఎస్‌డీజీఎస్, టిడ్కో ఇళ్లు అంశాలపై జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఆమె సమీక్షించారు. లక్ష్యసాధనలో వెనుకబడిన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. పలు దశల నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను వేగంగా పూర్తిచేయించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. భూముల రీ సర్వేను వేగంగా చేపట్టాలన్నారు. ఇప్పటికే జిల్లాలో మొదటి దశలో 16 మండలాలు 16 గ్రామాలు, రెండో దశలో 12 మండలాలు 48 గ్రామాలు పూర్తిచేశామని, వచ్చేనెలలో మూడో దశలో 20 మండలాలు సుమారు 90 గ్రామాలకు సిద్ధం చేస్తున్నామన్నారు. డిజిటల్ లైబ్రరీలకు స్థలసేకరణ చేయాలని, ప్రభుత్వ భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతుల భరోసా కేంద్రాలు తదితర నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలన్నారు. మంగళవారం భీమవరం, నరసాపురం నియోజకవర్గాల సమీక్ష సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు. డీఆర్వో కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల ఆనందోత్సాహాలు

- 23 శాతం పెరిగిన జీతం
- కేడర్‌ను బట్టి రూ.5 వేల నుంచి రూ.16 వేల వరకు పెంపుదల
- ఉమ్మడి జిల్లాలో 269 మంది ఉద్యోగులు
- సర్వత్రా హర్షాతిరేకాలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పరిధిలో పనిచేసే సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పావర్టీ) ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. వచ్చేనెల నుంచి వీరి జీతాలు పెంచుతూ ఆదేశాలు ఇచ్చారు. కొంత కాలంగా జీతాలు పెంచాలని సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జీతాలు పెంచుతూ సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సీఎం జగన్ చిత్రపటానికి ఉద్యోగులు క్షీరాభిషేకాలు చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

బేసిక్‌పై 23 శాతం వరకు..

సెర్ప్ ఉద్యోగులకు బేసిక్ వేతనంపై 23 శాతం జీతం పెంచారు. జీతం పెంచడం జరిగింది. సెర్ప్‌లో కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ (సీసీ), అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం), డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం), అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్స్ (ఏపీ) ఉద్యోగులు పనిచేస్తున్నారు. సీసీల జీతం రూ.25 వేల నుంచి రూ.40 వేలు ఉండగా వారికి రూ.5,750 నుంచి రూ.9,200 వరకు, ఏపీఎంలకు జీతం రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఉండగా వారికి రూ.9,200 నుంచి రూ.11,500 వరకు, డీపీఎంలకు జీతం రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఉండగా వారికి రూ.13,800 నుంచి రూ.16,100 వరకు, ఏపీలకు 5 వేల నుంచి 7 వేల వరకు జీతం పెరిగింది.

పథకాల అమలులో కీలకంగా..

ఉమ్మడి జిల్లాలో సెర్ప్‌లో 269 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో పశ్చిమగోదావరి జిల్లాలో 85 మంది, ఏలూరు జిల్లాలో 184 మంది విధులు నిర్వహిస్తున్నారు. డ్వాక్రా గ్రూపుల అభివృద్ధి, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, జగనన్న పాల వెల్లువ, ఉన్నతి వంటి పథకాలను మహిళలకు పారదర్శకంగా అందించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాంకు రుణాల మంజూరు, స్వయం ఉపాధి, చిరు వ్యాపారాలకు తోడ్పాటు అందిస్తున్నారు.



పెనుగొండలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

సెర్ప్ ఉద్యోగులు

ఉద్యోగి	పశ్చిమగోదావరి	ఏలూరు
డీపీఎం	4	7
ఏపీఎం	15	31
సీసీ	60	125
ఏపీ	6	21
మొత్తం	85	184

చాలా సంతోషం



సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం 23 శాతం జీతాలు పెంచడం సంతోషం. జీతాలు పెంచాలని కొంత కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మా గురించి ఆలోచన చేసిన సీఎం జగన్ సార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ప్రభుత్వం జీతాలు పెంచడం ద్వారా సీసీలు, ఏపీఎంలు, డీపీఎంలు, ఏపీలకు మేలు జరుగుతుంది.

– సీహెచ్ రాజేష్, ఏపీఎం, గణపవరం మండలం

నాకు రూ.6,210 పెరిగింది



నాకు రూ.6,210 జీతం పెరిగింది. జీతాల పెరుగుతాయని ఎదురుచూస్తున్న మాకు సీఎం సార్ తీసుకున్న నిర్ణయం సంతోషం కలిగించింది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

– టి.కాంతారావు, సీసీ, ఆకివీడు మండలం

సెప్టెంబర్ నుంచి అమలులోకి..



సెర్ప్ ఉద్యోగులకు బేసిక్‌పై 23 శాతం జీతం పెంచడం హర్షణీయం. పశ్చిమగోదావరి డీఆర్‌డీఏ పరిధిలో 85 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారికి కేడర్‌ను బట్టి రూ.5 వేల నుంచి రూ.16 వేల వరకు జీతాలు పెరిగాయి. వచ్చే నెలలో పెరిగిన జీతాలను ప్రభుత్వం వారికి చెల్లిస్తుంది.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ, భీమవరం

గోడౌన్ల నిర్మాణం వేగిరపర్చాలి

భీమవరం ప్రకాశం చౌక్: మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు (గోడౌన్లు) త్వరితగతిన అందుబాటులో తీసుకురావాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇంప్లిమెంటేషన్ స్క్రీనింగ్ కమిటీతో ఆమె సమావేశమయ్యారు. రానున్న రెండు నెలల్లో ఖరీఫ్ పంట చేతికొస్తుందని, ముందుగానే గోడౌన్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఐదు గోడౌన్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి సౌలభ్యంగా ఉంటుందన్నారు. మిగిలిన గోడౌన్ల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తిచేసి నిర్మాణాలను చేపట్టాలన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మొగల్తూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు గోడౌన్లు శేరేపాలెం, రామన్నపాలెం, పండితవల్లూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఒక గోడౌన్ పండితవల్లూరులో నిర్మాణాలు పూర్తి చేసుకున్న వాటికి సంబంధించిన బిల్లులను ఆమోదించారు. బిల్లుల మొత్తాలను డీసీసీ బ్యాంకు త్వరితగతిన చెల్లించాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. అమూల్ డెయిరీ ఫార్మర్స్‌కు లోన్లు మంజూరు చేయాలని సూచించారు. జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎ.దుర్గేష్, డీసీసీబీ సీఈఓ శ్రీదేవి, నాబార్డ్ ప్రతినిధి టి.అనిల్‌కాంత్, ఆప్కాబ్ డీపీడీఎం తులసీదాస్, పీఏసీఎస్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



108లో ప్రసవించిన బిడ్డను పరీక్షిస్తున్న ఈఎంటీ తేజబాబు

మొగల్తూరు: పురుటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108లో ప్రసవమైంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మొగల్తూరు మండలం పాతపాడుకు చెందిన పి.గాయత్రి సోమవారం ఉదయం పురిటినొప్పులతో బాధపడడంతో.. సమాచారం అందుకున్న ఆశా వర్కర్ వెంకటలక్ష్మి 108కు సమాచారం అందించారు. పాతపాడు నుంచి భీమవరం ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో రహదారి పక్కనే ఆపి ప్రసవం చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ తేజబాబు, పైలట్ పాపారావు, ఆశ వర్కర్ సుఖ ప్రసవం చేయడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షల్లో పరుగులో పాల్గొన్న అభ్యర్థులు



ఎత్తును పరిశీలిస్తున్న సిబ్బంది



లాంగ్‌జంప్

గెలుపే లక్ష్యం

- ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియ మరూ
- 600 మంది అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు టౌన్: ప్రభుత్వం ఎస్సై పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. ప్రిలిమినరీ పరీక్షలు పూర్తి కాగా, రెండో దశ ఫిజికల్ టెస్ట్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. మూడో రోజు సోమవారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తు, ఏర్పాట్లు మధ్య ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్వీయ పర్యవేక్షణలో పరీక్షలు సాగుతున్నాయి. సీసీ కెమెరాల నిఘాలో పోటీలు నిర్వహిస్తున్నారు. 28న దేహదారుఢ్య పరీక్షలకు సుమారు 600 మంది అభ్యర్థులు హాజరైనట్లు పోలీస్ అధికారులు తెలిపారు. నోటిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులకు ప్రతి రోజూ ఫిజికల్ టెస్ట్‌లు చేపట్టేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఎంపిక ప్రక్రియలో లోపాలు లేకుండా



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న పోలీసు సిబ్బంది

నిష్పక్షపాతంగా వ్యవహరించే సమర్థవంతులైన పోలీస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీఎస్పీలు నున్న మురళీకృష్ణ, విజయ్‌పాల్, కే.ప్రభాకర్‌రావు పోటీ పరీక్షలు సజావుగా సాగేలా విధులు నిర్వర్తిస్తున్నారు.

సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేసి, అభ్యర్థుల ఎత్తు, చాతి కొలత, బరువు వంటి స్క్రీనింగ్ టెస్ట్‌లు చేశారు. అనంతరం 100 మీటర్లు, 1600 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఒక అభ్యర్థి పడిపోవడంతో కాలుకు గాయమైంది. అతడిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించి వైద్య చికిత్స అందించారు.

పూర్తిస్థాయిలో సిద్ధపడి రావాలి

ఎస్సై ఉద్యోగాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పూర్తిస్థాయిలో సిద్ధపడి పోటీలకు హాజరుకావాలి. అభ్యర్థులు ఇడ్లీ వంటి తేలికపాటి అల్పాహారాన్ని భుజించి రావాలి. అరటి పండ్లు వెంట తెచ్చుకోవాలి. ప్లాస్టిక్ స్పైక్ షూస్ మాత్రమే వినియోగించాలి. ప్రశాంతమైన వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా పోటీల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాం.

–జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, భీమవరం: నేషనల్ మీన్స్–కం–మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)పరీక్షకు సెప్టెంబర్ 15వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్ 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలులోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

'గోదావరి నవ్వింది'కి గిడుగు పురస్కారం

పెనుగొండ: పెనుగొండకు చెందిన ప్రముఖ రచయిత ఎంఆర్‌వీ సత్యనారాయణ మూర్తి రచించిన గోదావరి నవ్వింది కథల పుస్తకానికి గిడుగు రామ్మూర్తి పంతులు జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు సోమవారం రచయిత ఎంఆర్‌వీ మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ గోదావరి నవ్వింది పుస్తకాన్ని జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బిక్కి కృష్ణ తెలిపారని వివరించారు. ఈ నెల 29న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభలో పురస్కారాన్ని అందిస్తారని తెలిపారు.

శ్రీవారి క్షేత్ర చరిత్రపై డాక్యుమెంటరీ

ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్ర చరిత్ర, స్థల పురాణంపై డాక్యుమెంటరీ ఫిలిం నిర్మించి, డిజిటల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి తీర్మానించింది. పద్మావతి కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. అందులో స్వామివారి ప్రధాన ఆలయంతో పాటు, ఉప, దత్తత దేవాలయాలు, అనుబంధ సంస్థల ఆదాయ, వ్యయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు ఆమోదముద్ర వేశారు. ముఖ్యంగా శ్రీవారి నృసింహ సాగరం (పుష్కరిణి)ని రూ. 3,94,895తో అభివృద్ధి చేసేందుకు, కేశఖండన శాల వద్ద రూ.3,34,763తో హెడ్ వాష్ టబ్స్ నిర్మించేందుకు తీర్మానించారు. కేశఖండనశాల వద్ద రూ. 27 లక్షలతో వేస్ట్ వాటర్ పైప్‌లైన్ నిర్మాణానికి, ఈ ఏడాది అక్టోబర్ 24 నుంచి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విద్యుత్ అలంకరణల నిమిత్తం రూ.11 లక్షలతో రూపొందించిన అంచనా వ్యయాలను ఆమోదించారు. ప్రసాదాల తయారీ కేంద్రం (అంబర్ ఖానా)లో రూ. 5,52,748తో ఎగ్జిస్ట్ సిస్టమ్ ఏర్పాటుకు టెండర్‌ను ఆమోదించారు.



ధర్మకర్తల మండలి సమావేశంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ త్రినాథరావు

రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం

భక్తులు వినియోగించిన శీతల పానీయాల బాటిల్స్, వాటర్ బాటిల్స్, ఇతర ప్లాస్టిక్ బాటిల్స్‌ను రీసైక్లింగ్ చేసే యూనిట్ ఏర్పాటు (శ్రీ సర్వారాయ షుగర్స్ లిమిటెడ్)కు స్థలం, విద్యుత్ అందించి, రీసైక్లింగ్ మెటీరియల్ ఒక్కో కేజీకి రూ.15 దేవస్థానం పొందేలా తీర్మానించారు. ఆలయ భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన 324 సీసీ కెమెరాల బ్యాకప్ 6 నెలలు పాటు ఉండేలా సర్వర్ ఏర్పాటుకు రూపొందించిన రూ. 38 లక్షల అంచనా వ్యయాన్ని ఆమోదించారు. విరాళాలు స్వీకరించేందుకు ఫైబర్ కౌంటర్, ఆలయ తూర్పు వైపు జంటగోపురాల వద్ద శ్రీవారి చరిత్ర తెలిపేలా రూ. 4,97,231తో ఫైబర్ విగ్రహాల ఏర్పాటుకు ఆమోదించారు. నిత్యకల్యాణ మండపం శ్లాబ్ లీకేజీ నివారణ పనులను రూ. 8,42,063తో చేపట్టేందుకు, కొండపైన చిల్డ్రన్స్ పార్క్‌లో మరిన్ని ఆట వస్తువులు ఏర్పాటు చేసేందుకు తీర్మానించారు. నిత్యాన్నదానానికి, స్వామివారి ప్రసాదాల తయారీకి అవసరమైన సరుకులు, శానిటరీ మెటీరియల్స్ కొనుగోలుకు వచ్చిన టెండర్లను ఆమోదించారు. తూర్పు వైపు ప్రవేశ మార్గంలో రూ.15.50 లక్షలతో ఎస్ఎస్ స్టాపర్ పోల్స్ ఏర్పాటుకు రూపొందించిన అంచనాలను ఆమోదించారు. ఆలయ పాలకవర్గ సమావేశ మందిరం, ఈఓ క్వార్టర్స్ నిర్మాణానికి ఆమోదముద్ర వేశారు. కొండపై ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ స్థానంలో, మొక్కజొన్న స్టార్చ్‌తో తయారైన బాటిల్స్‌ను వినియోగించేలా చర్యలు తీసుకునేందుకు తీర్మానించారు. నిత్యాన్నదాన భవనం వద్ద బస్ షెల్టర్‌ను రూ. 8.70 లక్షలతో ప్రసాదాల విక్రయాల కౌంటర్‌గా మార్చేందుకు, ధర్మఅప్పారాయ నిలయంలో బస చేసే భక్తులకు వేడి నీటిని అందించేందుకు రూ. 34 లక్షలతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. రంగాపురం లోని సత్యదేవుని ఆలయం వద్ద రూ. 16 లక్షలతో ఎమ్మెస్ షెడ్ నిర్మాణానికి రూపొందించిన అంచనా వ్యయాన్ని ఆమోదించారు. సమావేశంలో ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు నాళం కృష్ణ వీర సుబ్బలక్ష్మి, చిట్టూరి మణి, ముస్సే శ్రీను, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, మానుకొండ సుబ్బారావు, తాణంకి గంగరాజు, పాయం మంగతాయారు, పాలా వెంకటేశ్వరరావు, బోడపాటి దేవి మౌనిక, వాసా రామకృష్ణరావు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



కాళ్ల: మండలంలోని పెదఅమిరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

డ్రైవర్ పోస్టులకు 4న ఇంటర్వ్యూలు

పెంటపాడు: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల ఆధ్వర్యంలో ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పరిధిలో డ్రైవర్ పోస్టులకు సెప్టెంబర్ 4 లోగా దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల జిల్లా మేనేజర్ శివతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, నూజివీడు (ముసునూరు), పెరవలి ప్రాంతాలలో ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. 35 సంవత్సరాల్లోపు వయస్సు, పదో తరగతి పాస్‌తోపాటు, హెవీ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవింగ్‌లో 2 నుంచి మూడు సంవత్సరాల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు పెంటపాడు పశుసంవర్ధక శాఖ కార్యాలయం, ఏలూరులోని ఏఎస్‌ఆర్ స్టేడియం వద్ద ఉన్న వెటర్నరీ ఆసుపత్రి వద్ద సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 91105 95889 నెంబరులో సంప్రదించాలన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

సాక్షి, భీమవరం: తన భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని భీమవరం పట్టణ బేతనిపేటకు చెందిన దాసరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను చెప్పారు. లక్ష్మికి కొవ్వాడకు చెందిన దాసరి మురళీతో 2020 నవంబర్ 4న వివాహమైంది. మురళీ విప్రో కంపెనీలో పనిచేస్తున్నాడని చెప్పడంతో పెళ్లి సమయంలో రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చారు. వీరికి బాబు పుట్టాడు. ఆ తరువాత మురళీ వేధిస్తున్నాడని, అత్తమామలు, మరిది సహకరిస్తున్నారంటూ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీను చెప్పారు.

రూ.14.58 లక్షల ఆదాయం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండేళ్ల పాటు పలు వ్యాపారాల నిర్వహణకు స్వామివారి కల్యాణ మండపంలో సోమవారం దేవస్థానం అధికారులు నిర్వహించిన బహిరంగ వేలం, సీల్డ్ టెండర్ల ద్వారా స్వామివారికి నెలకు రూ.14,58,000 ఆదాయం సమకూరింది. గతేడాది నెల ఆదాయంతో పోలిస్తే, ఈ ఏడాది నెల ఆదాయం రూ. 4.91 లక్షలు పెరిగిందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

మహిళను హత్య చేసిన ప్రియుడు

అనంతరం రైలుకింద పడి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ దక్షిణపు వీధిలోని ఒక ఇంట్లో వివాహిత దారుణ హత్యకు గురైంది. మహిళను ప్రియుడు దారుణంగా హత్య చేశాడు. అనంతరం అతను నూజివీడులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియురాలిని హత్యచేసి తరువాత రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మహిళ హత్య సమాచారం అందుకున్న ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు కూడా సంఘటనా స్థలానికి వెళ్ళి హత్య ఘటనపై ఆరా తీశారు. దిమ్మిట సత్యనారాయణ(35)కు కొంత కాలం క్రితం వివాహం కాగా, భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. అతను పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవించేవాడు. శనివారపుపేట గాలిగోపురం ప్రాంతానికి చెందిన ఉడత సుజాత (29)తో పరిచయం ఏర్పడింది. సుజాత భర్త లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సుజాత, సత్యనారాయణ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవల సుజాత తనను సరిగా పట్టించుకోవటం లేదని, చులకనగా చూస్తుందంటూ సత్యనారాయణ కక్ష పెంచుకున్నాడు. సుజాతను తన ఇంటికి రప్పించుకుని.. చాకుతో గొంతుకోసి ఆదివారం రాత్రి హత్య చేసి ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాల్సి ఉందని ఏలూరు డీఎస్పీ తెలిపారు.



హత్యకు గురైన సుజాత (ఫైల్)

చులకనగా చూడడం వల్లే..

ముందుగా సత్యనారాయణ ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. నూజివీడు రైల్వే బ్రిడ్జి వద్ద రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు అతడి ప్యాంట్ జేబును పరిశీలించగా తన అడ్రస్‌తో కూడిన ఉత్తరం, సూసైడ్ నోట్ లభించాయి. రైల్వే పోలీసులు ఏలూరులోని సత్యనారాయణ బంధువులకు ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం ఇచ్చారు. అనుమానంతో బంధువులు ఇంటికి వెళ్లి చూడగా తాళాలు వేసి ఉన్నాయి. తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడడంతో మహిళ హత్యకు విషయం బయటపడింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్ళి విచారణ చేశారు. తనను చులకనగా చూడడం, సరిగ్గా పట్టించుకోకపోవటంతో హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో ఉందని తెలుస్తోంది. వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించాలి



తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు జగ్జీవన్

తాడేపల్లిగూడెం రూరల్: దళితవాడల్లో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటి సభ్యుడు తెన్నేటి జగ్జీవన్ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని పోలీస్‌సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్‌తో సబ్ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలపై జగ్జీవన్ చర్చించారు. ఆయన వెంట న్యాయవాది జె.సురేష్‌బాబు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



నందమూరు గ్రామంలో మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవాదళ్ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని సత్య సాయి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణ రావు అన్నారు. సోమవారం మండలంలోని నందమూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మౌలిక సదుపాయాల కల్పన కారణంగా చెట్లను నరికివేయడం జరుగుతుందని, ఇది పర్యావరణకు చేటు చేస్తుందన్నారు. మొక్కలను విరివిగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కే.రవీంద్రప్రసాద్, చామర్తి సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, ఎంఎస్.ప్రకాశరావు, 60 మంది సత్య సాయి సేవాదళ్ భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: స్థానిక సుబ్బారావుపేట దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు దాతలు సోమవారం అన్నదానం చేశారు. షేక్ అయాన్ పుట్టినరోజును పురస్కరించుకొని తల్లి తండ్రులు షేక్ సత్తార్, షహీనా దంపతులు పిల్లలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కె.బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు పొన్నూరు భాస్కరయ్య

తాడేపల్లిగూడెం: రజకుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పొన్నూరు భాస్కరయ్య అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కనపర్తి రామకృష్ణ, వద్దిపర్తి శ్రీను, మడకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాకారుల సమావేశం

తాడేపల్లిగూడెం: పట్టణంలో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 135వ నెలవారీ సభా కార్యక్రమం మంగళవారం గీతా మందిరంలో ఏర్పాటు చేసినట్లు సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం వల్ల అనర్థాలు

తాడేపల్లిగూడెం: మద్యం తాగడం వల్ల అనేక అనర్థాలు ఉత్పన్నమవుతాయని దేవీ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో దేవీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. మద్యం అలవాట్లను మాన్పించడానికి తమ సంస్థ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కౌన్సిలర్ శ్రీను, పీర్ ఎడ్యుకేటర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్యం

- పేదల ఆరోగ్యానికి పెద్దపీట
- ఫలితాలు ఇస్తున్న ఫ్యామిలీ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- పేదల ఇంటికి వెళ్లి చికిత్స చేస్తున్న ప్రభుత్వ వైద్యులు



ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వ వైద్యులు

పెంటపాడు: గ్రామీణ ప్రాంతాలల్లో వైద్య సేవలను ఇంటి ముంగిటకే చేర్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. గతంలో పేదలకు సుస్తీ చేస్తే వ్యయ ప్రయాసలకు ఓర్చి పట్టణాలకు వెళ్లవలసిన పరిస్థితులు ఉండేవి. కానీ ముఖ్యమంత్రి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పేదల ఇంటికి వెళ్లి మరీ ప్రభుత్వ వైద్యులు సేవలు అందిస్తున్నారు.

రోగి ఇంటికే ప్రభుత్వ వైద్యం

అనారోగ్యంతో అవస్థలు పడుతున్న రోగి ఇంటి వద్దకే నాణ్యమైన ప్రభుత్వ వైద్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్‌ను రూపొందించింది. మండలంలోని పీహెచ్‌సీ పరిధిలోని పలు విలేజ్ క్లినిక్‌ల వైద్యులు ఇంటింటికి వెళ్లి వైద్యం చేస్తున్నారు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో మిడ్‌లెవిల్ ప్రొవైడర్‌లుగా బీఎస్సీ నర్సింగ్ చేసిన వారిని ప్రజలకు, పీహెచ్‌సీలకు మధ్య అనుసంధాన కర్తలుగా విధుల్లో నియమించారు. వీరి వద్ద 67 రకాల మందులు,14 రకాల రక్త పరీక్షలు, నిత్యం అందుబాటులో ఉంటాయి. క్లినిక్‌ల పరిధిలోని 104 పీహెచ్‌సీ వైద్యులు, అధికారులు, ఉద్యోగులు, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో క్షేత్ర స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారు. నిర్దేశించుకొన్న షెడ్యూల్ ప్రకారం నెలలో సుమారు 10 రోజులకు పైగా 104 వాహనం ద్వారా వైద్యసిబ్బంది సేవలందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడేవారికి కల్పతరువుగా మారి వారి బాధలను దూరం చేస్తున్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు ఇలా

పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం గ్రామాల్లోనే విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు పక్కాగా ఏర్పాటు చేసింది. వాటిని పక్కా భవనాలు సమకూర్చేందుకు నిధులను సైతం కేటాయించింది. ఒక్కో భవనానికి రూ. 17.50 లక్షలు మంజూరుచేయగా అవి యుద్ధ ప్రాతిపదికన నిర్మితమవుతున్నాయి. మండలంలో 17 క్లినిక్‌లకు గాను సుమారుగా 7 భవనాలు నిర్మాణదశలలో ఉన్నాయి. ఆయా హెల్త్‌క్లినిక్‌లలో రోజుకు సుమారు 40నుంచి 50 మంది రోగులకు వైద్యసేవలు అందుతున్నాయి. రోజుకు సుమారు 30 మందికి టెలీకన్సలేషన్ సేవలందిస్తున్నారు.

పర్యవేక్షణకు పెద్దపీట

వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం విలేజ్ టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఈ ఏడాది మార్చి 28న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేస్తుంది. బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పిలిచే మిడ్‌లెవిల్ ప్రొవైడర్ ప్రతీ గ్రామంలో లీడర్‌గా వ్యవహరిస్తారు. ఆశ, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక్కొక్కరు చొప్పున స్కూల్ హెల్త్ అంబాసిడర్ డ్వాక్రా గ్రూపు అధ్యక్షులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. వారంతా వైద్య, ఆరోగ్య కార్యాక్రమాలను పర్యవేక్షిస్తారు.

జగనన్నే సీఎంగా ఉండాలి



గతంలో వైద్యం కోసం, డాక్టర్లు రాసిన మందుల కోసం చాలా ఇబ్బందులు పడేవాళ్లం. సీఎం జగన్ మా ఇంటికే డాక్టర్‌ను పంపి వైద్యం అందిస్తున్నారు. మందులు కూడా ఇంటిదగ్గరే ఇస్తున్నారు. వేరే అవసరం వచ్చినా క్లినిక్ దగ్గరికి వెళ్లి అవసరమైన మందులు తెచ్చుకొంటున్నాం. జగనన్న ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా జగనన్న పదికాలాల పాటు చల్లగా ఉండాలి.
– వై. రామకృష్ణ, ప్రత్తిపాడు

అందుబాటులో వైద్యం



మా ప్రాంతంలో నెలకు రెండు సార్లు 104 వాహనం వస్తుంది. బీపీతో పాటు, ఇతరపరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. అంతేకాకుండా సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నారు. జగనన్న పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది.
– ముప్పిడి సరోజని, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కోరిమిల్లి

డాక్టర్ వచ్చేది ముందుగా తెలుస్తుంది



ఫ్యామిలీ వైద్యవిధానం వల్ల ప్రతీ ఒక్కరికీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముందస్తు సమాచారంతో ఏఎన్ఎంలు, ఏఎల్‌హెచ్‌ఈలు, ఆశ కార్యకర్తలు ప్రతీ ఇంటికి వచ్చి ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ నెలలో ఏ రోజు వస్తున్నారో ముందస్తుగా సమాచారం ఇస్తున్నారు. అదే రోజు మా గ్రామం నుంచి అక్కడికి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు.
– మద్దే కృష్ణమూర్తి, కొండేపాడు

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



పెంటపాడులో డ్వాక్రా మహిళలకు పెరటికోళ్లు అందిస్తున్న ఎంపీపీ హైమావతి తదితరులు

పెంటపాడు: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వీలుగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి హైమావతి పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు మండల సమాఖ్య కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు పెరటికోళ్ల పెంపకం కార్యక్రమంలో భాగంగా 10 యూనిట్లుకు పెరటికోళ్లను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్ జగనన్న ప్రభుత్వం అక్కా చెల్లెమ్మల అభివృద్ధే లక్ష్యంగా డ్వాక్రా సంఘ సభ్యులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంగా పెట్టుకొన్నారన్నారు. పెరటికోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పెరటికోళ్ల పెంపకం వల్ల గుడ్ల ద్వారా ఆదాయం పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ఏపీఎం అహ్మద్ మాట్లాడుతూ పెంటపాడు మండలానికి 100 యూనిట్లు అందాయన్నారు. పెంటపాడు క్లస్టర్ పరిధిలో 10 యూనిట్లు పంపిణీ చేశామన్నారు. మిగతా గ్రామాల్లో త్వరితగతిన పంపిణీకి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, పెంటపాడు ఎంపీడీవో బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి బాబి, మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి ప్రవీణ, ఏపీఎం అహ్మద్, సీసీలు పాల్గొన్నారు.

4న దొమ్మేటి విగ్రహ ఆవిష్కరణ



ఇరగవరం ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

ఇరగవరం: వచ్చే నెల 4వ తేదిన ఇరగవంలో శెట్టిబలిజ నాయకులు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఇరగవరం ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 4వ తేదీన ఇరగవరం సెంటర్ దొమ్మేటి వెంకట రెడ్డి ఆవిష్కరణ రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులు మీదగా జరుగుతుందన్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో భారీ బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏమ్మెల్సీ కవురు శ్రీనివాస్, కోన సీమ ఏఎస్ఎఫ్ అధ్యక్షుడు సుభాష్, జిల్లాకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ పంపన అంజిబాబు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు పాల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ ,ఏఎంసీ వైస్ చైర్మెన్ మామిశెట్టి శ్రీను, ఎంపీటీసీ పాల పాలేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి సత్యనారాయణ ఎంపీటీసీ వీరవల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెక్కుల అందజేత

సాక్షి, భీమవరం: పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం మంతెన రామలింగరాజు, కాంతమ్మ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ రాజు తెలిపారు. ఫౌండేషన్ 49వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రామలింగరాజు నివాసంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ముందుగా రామలింగరాజు, కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంబీబీఎస్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు రూ.45 వేలు, ఇంజనీరింగ్ విద్యార్థులు 28 మందికి రూ.3 లక్షలు, బీ ఫార్మసీ విద్యార్థికి రూ.11 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులు నలుగురికి రూ.36 వేలు, చార్టర్డ్ అకౌంటెంట్ విద్యార్థికి రూ.11 వేలు, పీజీ విద్యార్థులు ఏడుగురికి రూ.63 వేలు, డిగ్రీ విద్యార్థులు 9 మందికి రూ.81 వేలు, నీట్ విద్యార్థికి రూ.9 వేలు, ఇంటర్మీడియెట్ విద్యార్థికి రూ.9 వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి చేకూరి జాన్సీలక్ష్మి, అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ముదునూరి సూర్యనారాయణరాజు, సీహెచ్ఏవీఎల్ సుబ్రహ్మణ్యంరాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, మంతెన రామచంద్రరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, పేరిచర్ల లక్ష్మణవర్మ, చెల్లబోయిన రంగారావు, ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధిపై దృష్టి

నరసాపురం రూరల్: నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధిపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది ఉన్నచోట అత్యవసర మరమ్మతులు చేపట్టాలన్నారు. మోడి, వేములదీవి, కరింశెట్టి పాలెం, తూర్పుతాళ్లు మీదుగా లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, దర్బరేవు రహదారి నిర్మాణం, నరసాపురం మున్సిపాలిటీ నుంచి లక్ష్మణేశ్వరం మీదుగా సారవ రహదారి నిర్మాణం తీరం వెంబడి మెట్రేవు నుంచి అల్లం వారి మెరక, కెపీపాలెంసౌత్ మీదుగా పేరుపాలెం సౌత్ రహదారి నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.15 కోట్లు మంజూరు కాగా టెండర్ల దశ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించాలని అన్నారు. టెండరు ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. చేపట్టిన పనుల పురోగతిపై ఆరా తీసి వాటిని మరింత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నూతనంగా నిర్మాణాలు చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ జీవీఎస్ కిరణ్‌కుమార్, ఏఈ నిక్కీక్రజ్ ఉన్నారు.

తణుకులో బెదురులంక చిత్ర యూనిట్ సందడి

తణుకు టౌన్: ఇటీవల విడుదలైన బెదురులంక సినిమా విజయోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి తణుకులో చిత్ర యూనిట్ సభ్యులు సందడి చేశారు. సోమవారం రాత్రి బెదురులంక సినిమా ప్రదర్శిస్తున్న లక్ష్మీ థియేటర్‌లో ప్రేక్షకులతో కలసి సినిమా హీరో కార్తికేయ, ఇతర చిత్ర యూనిట్ సభ్యులు కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా హీరో, ఇతర యూనిట్ సభ్యులకు సాయి, దేవిరెడ్డి గణేష్, వెంకట్, రెల్లు రాయుడు, జేమ్స్ నాయుడు, లక్ష్మీ థియేటర్ సిబ్బంది స్వాగతం పలికారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



అంగన్‌వాడీ ఆయాలకు నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన, బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతనంగా నియమించిన అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలు విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా పనిచేసి పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ మల్లికార్జునరావు

ఉండి: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా రీసర్వే కార్యక్రమంపై గ్రామాధికారులు ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉండిలోని మండల పరిషత్ కార్యాలయంలో రీసర్వేపై గ్రామ పంచాయతీ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గతంలో రీసర్వే కార్యక్రమం ద్వారా పంట భూమిలను సర్వే చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రతీ ఇంటినీ రీసర్వే కార్యక్రమంలో కొలతలు వేసి ఇంటి యజమానులకు ప్రాపర్టీ కార్డులు అందజేస్తారని అన్నారు. దీనిలో భాగంగా పంచాయతీ గ్రామ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గతంలో డ్రోన్ పై జరిగిన ప్రాంతాలకు సంబంధించి త్వరలోనే మ్యాప్‌లు వస్తాయని అవి రాగానే రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించి రీసర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమావేశమై ఓటు నమోదు కార్యక్రమంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులకు అందించిన వివరాల ప్రకారం అర్హులైన కొత్త ఓట్లు నమోదు, మరణించిన, శాశ్వతంగా ఊరువిడిచి వెళ్లిపోయిన ఓట్లు తొలగించాలన్నారు.

జూదరుల అరెస్ట్

సాక్షి, భీమవరం: స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవరం ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.అప్పారావు చెప్పారు. ఉండి రోడ్డులోని కారుల షెడ్‌లో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.17,240 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమాలు

తాడేపల్లిగూడెం: అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావులు అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం విద్యుత్ పోరాటాల అమరవీరుల సంస్మరణ సమావేశం జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. చంద్రబాబు హయాంలో 2000 ఆగస్టు 28న నిరంకుశంగా జరిగిన కాల్పుల్లో మరణించిన వీరుల త్యాగాలను ఒక సారి గుర్తు చేసుకోవాల్నారు. విద్యుత్ చార్జీల విషయంలో ప్రస్తుత ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం: పెదతాడేపల్లి 33బార్ లెవెన్ ఉపకేంద్రంలో 5 ఎంవీఏ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాకు కొన్ని గంటలు అంతరాయం ఏర్పడుతుందని డీఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కారణంగా కుంచనపల్లి, ఎల్.అగ్రహారం, చిన తాడేపల్లి, కొండ్రుపోలు, మెట్ట ఉప్పరగూడెం, అప్పారావుపేట, ఇటుకుల గుంట,కొత్తూరు గ్రామాల్లో, పట్టణంలో ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.



హెల్మెట్ వినియోగంపై మెగా డ్రైవ్

తప్పక నిబంధనలు పాటించాలి




ఇటీవల తణుకులో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్ (ఫైల్)

తణుకు: రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది... ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు... 80 శాతం మంది తలకు గాయాల వల్లనే చనిపోతున్నారు... జాతీయ రహదారి భద్రత సంస్థ ఈ విషయాలను ఇటీవల నివేదికలో స్పష్టం చేసింది. అయితే వాహనదారులు మాత్రం సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వరుస ప్రమాదాలు నేపథ్యంలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ఈ అంశంపై ఫోకస్ పెట్టారు. మార్చి 1 నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాహనదారుల్లో స్పందన కరవైంది. దీంతో హెల్మెట్ వినియోగంపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల హెల్మెట్ వినియోగంపై పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా మెగా డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

జిల్లాలో ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో చాల మంది ప్రాణాలు కోల్పోతుండగా వీరిలో యువత ఎక్కువ శాతం మంది చనిపోతున్నారు. అయితే తణుకు సర్కిల్ పరిధిలో హెల్మెట్ వినియోగంపై గత మూడు నెలలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ ఒక్కరు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రాకపోవడంతో పోలీసులు కఠిన చర్యలకు దిగారు. హెల్మెట్ ధరించకపోతే పట్టణంలోకి అనుమతి లేదని గతంలో శివారు ప్రాంతాల్లో నిలిపివేశారు. అయితే హెల్మెట్ ధరించని వారిని ఆపి జరిమానా వేయడం పాత విధానం కాగా ఇకపై అలా వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే మాత్రం వాహనాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుంటారు. హెల్మెట్ కొనుగోలు చేసి ధరించే వారిని ప్రోత్సహిస్తున్నారు. ఇంటి వద్ద ఉందని చెబితే తీసుకువచ్చిన తర్వాతనే ఇస్తామని తెగేసి చెబుతున్నారు.

చర్యలు తప్పవు



హెల్మెట్ వినియోగంపై గత కొన్ని నెలలుగా అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడంలేదు. దీంతో కఠిన చర్యలు తీసుకుంటున్నాం. హెల్మెట్ ధరించకపోతే పట్టణంలోకి అనుమతి నిరాకరిస్తున్నాం. మరోవైపు ఇటీవలి కాలంలో హెల్మెట్ వినియోగంపై మెగా డ్రైవ్ చేపట్టాం.
– జానా సతీష్, ట్రాఫిక్ ఎస్సై, తణుకు